యాదగిరీశుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, మే 16 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్లకు నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపించారు. శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువరాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి స్వామివారికి చేపట్టిన శయనోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిగాయి. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.54,93,945 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

భువనగిరిలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డెంగీ నివారణకు సహకరించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పాపారావు

భువనగిరి అర్బన్, మే 16 : డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పాపారావు కోరారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సమాజంలో భాగస్వాములై.. డెంగీ నివారిద్దాం అనే ఉద్దేశంతో ముందుకు సాగాలన్నారు. అంతేకాకుండా పరిసరాలలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా పాటించాలన్నారు. కిటికీలు, గుమ్మాలు, తలుపులకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలని, దోమ తెరలను వాడాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డెంగీ వ్యాధి నిర్ధారణ చికిత్సలు చేయాలని, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్లు రామకృష్ణ, సుమన్ కల్యాణ్, వంశీకృష్ణ, డిప్యూటీ డీఈఎండీ మధుసూదన్‌రెడ్డి, ఏఎంఓ డాక్టర్ మధుమోహన్‌రావు, హెల్త్ ఎడ్యుకేటర్ సాయిరెడ్డి, సీహెచ్ఓ నగేశ్, ఎల్‌టీ ప్రవీణ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మండల వైద్యాధికారి విలియం కేరి

ఆత్మకూరు(ఎం)లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

ఆత్మకూరు(ఎం), మే 16 : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి విలియంకేరీ మాట్లాడుతూ.. ప్రజలంతా డెంగీ నిర్మూలనకు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలను పారదోలాలన్నారు. ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా.. వెంటనే ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కరుణాకర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరాజు, సూపర్‌వైజర్ సాంబులమ్మ, సురేందర్, వెంకటేశ్, మహేశ్వరి, హేమ, శిరీష, సునీత పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పేలిన ఫ్రిడ్జ్.. ఇల్లు ధ్వంసం

బీబీనగర్, మే 16 : షార్ట్ సర్క్యూట్ కారణంగా మండలంలోని గూడూరుకు చెందిన దంతూరి ఆంజనేయులు ఇంట్లో ఫ్రిడ్జ్ పేలి అగ్నిప్రమాదం సంభవించింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా.. ఇంట్లో ఉన్న బీరువా, వంట సమాగ్రి, బియ్యం, 25 వేల నగదు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ..ప్రమాదంతో పూర్తిగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వైభవంగా వెంకటేశ్వరుడి తిరుకల్యాణం

వెంకటేశ్వరాలయంలో తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాజాపేట, మే 16 : మండలంలోని రేణికుంట శివారులో రెయిన్‌బో డెవలపర్స్ ఆధ్వర్యంలో నిర్మించిన సంకల్ప సిద్ధి వెంకటేశ్వరాలయంలో గురువారం వెంకటేశ్వరుడి తిరుకల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గోవింద నామస్మరణలతో ఆలయం మార్మోగింది. భక్తులకు ఆలయ ధర్మకర్తలు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు బద్రీనాథ్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డి, రాఘవేంద్ర, శ్రీనివాస్‌రావు, నరేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తపై హత్యాయత్నం

- అదే పార్టీకి చెందిన వారు దాడి
- తనకు ప్రాణహాని ఉందని బాధితుడి మొర

చౌటుప్పల్, మే 16 : మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త పల్సం శ్రీనుపై అదే పార్టీకి చెందిన వారు గురువారం రాత్రి హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాలు.. తాను 20 ఏండ్లుగా పార్టీని నమ్ముకొని పని చేస్తున్నానని, తనను ఏదైనా ఒక వార్డుకు ఇన్‌చార్జిగా నియమించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అనుచరుడు బాలు మహేందర్‌ను కోరినట్లు తెలిపాడు. దాంతో అతడు అసభ్యకరంగా మాట్లాడేసరికి ఇద్దరి మధ్య గొడవ జరిగిందన్నాడు. మహేందర్ తనను చంపుతానని బెదిరించాడని, దాంతో తనను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కాపాడుతాడని చెప్పానని తెలిపాడు. కానీ, రాజగోపాల్‌రెడ్డినే నిన్ను చంపమన్నాడని మహేందర్ చెప్పినట్లు బాధితుడు పేర్కొన్నాడు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే పీఏ సతీశ్ తన సోదరుడికి ఫోన్ చేసి.. మీ తమ్ముడు అనవసరంగా రాజకీయం చేస్తున్నాడు జాగ్రత్త అని బెదిరించాడని, వారంతా కలిసి తనను చంపేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితుడు చెప్పారు. గురువారం రాత్రి నంబర్ ప్లేట్ లేని స్కార్పియోలో 10 మంది వచ్చి తాను ఓ హోటల్ వద్ద టీ తాగుతుండగా వెనుక నుంచి వచ్చి రాళ్లతో తనపై దాడి చేసినట్లు తెలిపాడు. ఈ సందర్భంగా.. మహేందర్‌తో గొడవ పెట్టుకుంటావా? నీ అంతు చూస్తామని దుండగులు బెదిరించినట్లు చెప్పాడు.

ఎమ్మెల్యే సహకారంతోనే మహేందర్ తనపై దాడి చేశాడని, అతని నుంచి ప్రాణహాని ఉందని, తనను కాపాడాలని వేడుకున్నాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

- చిట్యాల-భువనగిరి రహదారిపై బైఠాయించి ఆందోళన

ధాన్యం కొనుగోలు చేయాలని భువనగిరి-చిట్యాల రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులు, రైతు సంఘం నాయకులు

రామన్నపేట, మే 16 : ధాన్యం కొనుగోలు చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. అధికారులు స్పందించకపోవడంతో చిట్యాల-భువనగిరి రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జెల్లెల పెంటయ్య మాట్లాడుతూ.. మండలంలోని 26 కేంద్రాల్లో ధాన్యం పోసి రెండు నెలలు గడుస్తున్నా.. నేటికీ పూర్తి చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తడంతో మిల్లర్లు కొనడం లేదన్నారు. అంతేకాకుండా లారీల కొరతతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని అన్నారు. ఆరుగాలం కష్టపడి పనిచేసిన రైతుల పంటకు ప్రతిఫలం రాక రైతులు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని పేర్కొన్నారు. ఇకనైనా ధాన్యం కొనుగోలును యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, లేకుంటే వేల మంది రైతులతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నా వద్దకు తాసీల్దార్ లాల్‌బహదూర్, ఏపీఓ, పీఏసీఎస్ సీఈఓ వచ్చి నాలుగు రోజుల్లో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి ఉపేంద్రారవీందర్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండలాధ్యక్షుడు గన్నెబోయిన విజయభాస్కర్, కల్లూరి నగేశ్, గాదె నరేందర్, వనం ఉపేందర్, గొరిగె సోములు, కందుల హన్మంతు, బల్లూరి అంజయ్య, బాలరాజు, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గెలుపునకు కృషి చేయాలి

- పట్టభద్రుల సంఘం మండల ఉపాధ్యక్షుడు పాండు

బొమ్మలరామారం, మే 16 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ గా బీఆర్ఎస్ అభ్యర్థి అనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం పట్టభద్రులంతా సమష్టిగా కృషి చేయాలని మండల పట్టభద్రుల సంఘం ఉపాధ్యక్షుడు బేతాళ పాండు కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న యువత ఆకాంక్షలు నెరవేరాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ప్రతి పట్టభద్రుడు పది మంది పట్టభద్రులను కలిసి బీఆర్ఎస్ గెలుపు ఆవశ్యకతను వివరించాలని సూచించారు. త్వరలో మండల పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుండోజి వెంకటేశ్, వంశీరెడ్డి, ధన్‌రాజ్, పాండు, ప్రభాకర్ పాల్గొన్నారు.

కాల్వపల్లిలో పంట కోత ప్రయోగం

రాజాపేట, మే 16 : మండలంలోని కాల్వపల్లిలో గురువారం మండల వ్యవసాయాధికారులు పంట కోత దిగుబడి ప్రయోగం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 5 మీటర్ల వెడల్పు, 5 మీటర్ల పొడవులో పంట కోత ప్రయోగం నిర్వహించగా 8 కేజీల 20 గ్రాముల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. దిగుబడి అంచనాలకు ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడుతాయని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి అనూరాధ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ వెంకటేశ్వర్‌రెడ్డి, గణాంక అధికారి శ్రీకాంత్, ఏఈఓ భవ్య, రైతు అయిలయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు

భువనగిరి కలెక్టరేట్, మే 16 : కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జైపాల్‌రెడ్డి కోరారు. జిల్లాలో 10వ తరగతి ఉత్తీర్ణులై జీపీఏ 7 గ్రేడ్ పైబడి లేదా సమానంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు 2024-25 సంవత్సరానికి గానూ కార్పొరేట్ కళాశాల్లో అడ్మిషన్ కోసం ఈ నెల 30లోగా https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత ధ్రువపత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, కలెక్టర్ కాంప్లెక్స్‌లో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌ది వక్రబుద్ధి : కృష్ణ

చౌటుప్పల్ రూరల్ : ఎన్నికల ముందు వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు కేవలం సన్న ధాన్యానికే మాత్రమే ఇస్తామని చెప్పడం కాంగ్రెస్ వక్రబుద్ధికి నిదర్శనమని బీఆర్ఎస్ యువజన నాయకుడు ఉప్పు కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకుండానే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు రైతుబంధు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15వేలు రైతుభరోసా ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఇవ్వకుండా తప్పించుకుంటుందన్నారు. ఈ వానకాలం సీజన్ నుంచి అయినా రైతుభరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రామన్నపేట : దుబ్బాక కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు

- పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్వరాచారి

రామన్నపేట, మే 16 : రెండు నెలలు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని పీఏసీఎస్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటేశ్వరాచారి, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు గుండాల అంజయ్య అన్నారు. గురువారం మండలంలోని దుబ్బాకలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం కాంటా వేయకుండా, కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకుండా చోద్యం చూడడం సరి కాదన్నారు. నానా ఇకనైనా యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి కడారి వెంకటేశ్, కొమ్ము యాదయ్య, గట్టు బాల్‌రెడ్డి, సత్యనారాయణ, మామిండ్ల కృష్ణ, రాపోలు రమేశ్, సింగం లింగస్వామి, హనుమంతరావు, అశోక్, మహేందర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వలిగొండ, మే 16 : మండలంలోని పహిల్వాన్‌పూర్‌కు చెందిన మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి నర్సింహ ఎన్నికల విధులకు హాజరై గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, ఆయన కుటుంబానికి పీఆర్‌టీయూ తరపున ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి గురువారం రూ.లక్ష చెక్కను ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు పూల రవీందర్, మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



వలిగొండ : బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

సంస్థాన్‌నారాయణపురం : ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రానికి చెందిన సికిలమెట్ల సత్తయ్య ఇటీవల మృతి చెందారు. ఆయనది నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మృతుడి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీహరి, సుర్వి యాదయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ భిక్షం, వడ్డేపల్లి రాములు, ఉప్పల శ్రీను, రాచకొండ రవి, రాసాల వెంకటేశ్, చిలువేరు ముత్యాలు, చిలువేరు శంకర్, రాచకొండ గిరిబాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ వైర్లు

- ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టింపు లేని అధికారులు

సంస్థాన్ నారాయణపురం, మే 16 : మండలంలోని వావిళ్లపల్లిలో వారం క్రితం కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి తాటిచెట్టు విరిగి విద్యుత్ లైన్‌పై పడడంతో వైర్లు తెగిపోయాయి. ఈ విషయం అధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నారుమళ్లు సిద్ధం చేసుకునే సమయంలో విద్యుత్ వైర్లను పునరుద్ధరించాలని వారం నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది లేరని, సమయం పడుతుందని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

వావిళ్లపల్లిలో తాటిచెట్టు విరిగి పడడంతో తెగి పడిన విద్యుత్ వైర్లు

పోచంపల్లిలో డిగ్రీ కళాశాల కోసం ఎదురుచూపులు..

భూదాన్‌పోచంపల్లి, మే 16 : మండలంలో డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. డిగ్రీ కోసం హైదరాబాద్, భువనగిరి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండడంతో.. సమయానికి బస్సులు రాక, దూరప్రాంతాలకు వెళ్లలేక మధ్యలోనే చదువు మానేస్తున్నారు. భూదాన్‌నపోచంపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చారు కానీ, అమలుకు నోచడం లేదు. దాంతో ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలను హైదరాబాద్‌కు పంపించలేక చదువుకు స్వస్తి పలికించి పనిలో పెట్టిస్తున్నారు. దాంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. ప్రతి ఏటా ఇంటర్ పాస్ అయిన వారిలో సగం మంది మాత్రమే ఉన్నత చదువు చదువుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపకపోవడంతో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు నోచుకోలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఇకనైనా భూదాన్‌పోచంపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భిక్షపతి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భిక్షపతి

ఆత్మకూరు(ఎం), మే 16 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కోరె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి, నేడు సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని తెలుపడం రైతులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు సగం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోతే రైతులు తిరగబడుతారని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఎండీ అజీమొద్దీన్, ఉపేందర్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకి కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంరెడ్డి

రాజాపేట, మే 16 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుందని, రైతాంగాన్ని మరోసారి కాంగ్రెస్ సర్కారు మోసం చేసిందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొల్లపల్లి రాంరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సట్టు తిరుమలేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి మాట మార్చాడని, కేవలం సన్నరకం ధాన్యానికే బోనస్ ఇస్తామని చెప్పడం రైతులను వంచించడమే అని పేర్కొన్నారు. ఈ విషయం పార్లమెంట్ ఎన్నికలకు ముందే ప్రకటిస్తే రైతులు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేవారన్నారు. రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్‌కు వారి శాపం తగులుందని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు ఎర్రగోకుల జశ్వంత్, చింతల రాజు, ఎర్రగుంట కిషన్, గంధమల్ల సురేశ్ పాల్గొన్నారు.

రైతులతో కలిసి ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

ధాన్యం కొనుగోళ్లలో రైతుల గోస పట్టని ప్రభుత్వం

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

వలిగొండ, మే16 : రెండు నెలల క్రితమే ధాన్యాన్ని గొనుగోలు కేంద్రాలకు తరలించి ధాన్యం కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్న రైతుల గోసను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగక రైతులు అరిగోస పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఓట్లు వేయించుకోవడంపై ఉన్న శ్రద్ధ పంట కొనుగోళ్లపై లేదన్నారు. మూసీ పరీవాహక ప్రాంత రైతులు పండించిన పంటను ఏ-గ్రేడ్ కిందనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లారీలు, గన్నీ బ్యాగుల కొరత నివారించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ఎన్నికల ముందు ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న రూ.500 బోనస్‌ను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాలరాజు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, తుర్కపల్లి సురేందర్, కల్కూరి రాంచందర్, మెరుగు వెంకటేశం, గర్దాసు నర్సింహ, ఏలె కృష్ణ, కల్కూరి ముత్యాలు, కందాడి సత్తిరెడ్డి, వేముల నాగరాజు పాల్గొన్నారు.

శివారెడ్డిగూడెంలోని ఐకేపీలో ధాన్యాన్ని పరిశీలించి సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్‌డీఓ కృష్ణన్

పది రోజుల్లో ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలి

- డీఆర్‌డీఓ కృష్ణన్ -శివారెడ్డిగూడెంలో ఐకేపీ సెంటర్ సందర్శన

భూదాన్ పోచంపల్లి, మే 16 : పది రోజుల్లో ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని డీఆర్‌డీఓ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని శివారెడ్డిగూడెంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను నిర్వాహకులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నాణ్యత ఏ విధంగా పరీక్షిస్తున్నారని, ఎన్ని బస్తాలు కాంటా వేశారని, ఇంకెన్ని బస్తాలు ఉన్నాయని, ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం ఎలా ఉందని ఆరా తీశారు. వర్షాలు వస్తే జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ భాస్కర్, ఏపీఎం నీరజ, పంచాయతీ కార్యదర్శి రజిత, ఐకేపీ నిర్వాహకులు, రైతులు ఉన్నారు.